వరికి తెగుళ్ల బెడద

- ఆందోళనలో రైతులు
- దిగుబడిపై ప్రభావం చూపే ప్రమాదం

గోవిందరావుపేట: మండలంలోని రైతులు చాలా వరకు వరిపంటపై ఆధారపడి జీవిస్తుంటారు. మండలంలో సుమారుగా 15 వేల ఎకరాలకు పైగా వరిసాగు అవుతోంది. వరిపంటపై ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులతో రైతులు ఆందోళనలో చెందుతున్నారు. వర్షాల ప్రభావం వల్ల వరి పంటలో కాండం తొలుచు పురుగు, కుళ్లుడు తెగుళ్ల, ఆకు చుట్ట పురుగు వంటి సమస్యలతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పంటలో తెగుళ్లతో వరి చచ్చిపోతుంది. వ్యాధులను నియంత్రించేందుకు రైతులు తరచూ మందులు వేయాల్సి రావడంతో పెట్టుబడి పెరుగుతోంది. దీనికి తోడు యూరియా కొరత వరి పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మండలంలో పండించే వరి పంట సాగుకు 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 22 వందల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. మరో 8 వందల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. సమయానికి రైతులకు యూరియా అందక పంటలకు వేయలేని పరిస్థితి. యూరియా వేయకపోవడంతో ఆకులు పసుపు రంగులో మారి పంట బలహీనంగా మారడంతో కలుపు మొక్కలు పెరిగిపోతున్నాయి. అటు అధిక వర్షాలు ఇటు యూరియా కొరతతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అధిక వర్షపాతంతో దెబ్బతిన్న వరి



పంటలో తెగుళ్లు వచ్చి చనిపోయిన వరిని చూపిస్తున్న రైతు

తెగుళ్లు సోకాయి..



అధిక వర్షపాతంతో వరి పొలాల్లో తెగుళ్లు పెరిగిపోయాయి. మందులు వేసినా నియంత్రణలోకి రావడం లేదు. అంతే కాక యూరియా కొరతతో పంట పెరుగుదల కూడా బాగా దెబ్బతింది. గతంలో ఎకరానికి 30 బస్తాల నుంచి 40 బస్తాల వరకు వరి పంట దిగుబడి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే 20 బస్తాలు కూడా రావడం కష్టమే అనిపిస్తోంది.

– కొంపెల్లి కృష్ణారెడ్డి, రైతు, చల్వాయి

ఆందోళన చెందొద్దు..



మండలంలో ఎదురయ్యే పరిస్థితులకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మండలంలో పండించే వరి పంటకు సరిపోను యూరియా దిగుమతి అవుతూనే ఉంది. మండలంలో కురిసే అధిక వర్షపాతం వల్ల వరి పంటలో కుళ్లుడు తెగుళ్ల వస్తుంది. దీని నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.

– జితేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



మంగపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా పొదిళ్ల శ్రీనివాస్ అదనపు బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఎంపీడీఓ భద్రునాయక్‌ను ములుగు డీఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఎంపీఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీగా అదనపు బాధ్యతలను చేపట్టిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా టాస్, ఉల్లాస్ కోఆర్డినేటర్ పీర్ల కృష్ణబాబు దంపతులను గురువారం ఏటీఏ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ (ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్)నాయకులు కోరం సంతోష్, పసుల సూర్యనారాయణ, బొగ్గుల లక్ష్మయ్య, పరమేశ్వరావు, ఇందిరదేవి, నాగమణి, శిల్ప, భుజంగరావు, గణేశ్ తదితరులు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

ములుగు రూరల్: ఇసుక లారీ డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన మల్లంపల్లి మండలం పందికుంట స్టేజ్ వద్ద గురువారం చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏటూరునాగారం నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి పందికుంట స్టేజ్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ ధ్వంసం కావడంతో మరో లారీలోకి ఇసుకను డంప్ చేసి రవాణకు ఇబ్బంది కాకుండా జాతీయ రహదారి నుంచి లారీని తొలగించారు.

స్తంభాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం గుడి మలుపు వద్ద గురువారం సాయంత్రం విద్యుత్ స్తంభాన్ని ఇసుక లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగిపోయింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పోల్‌ను తొలగించి కొత్త పోల్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పౌష్టికాహారంపై అవగాహన

కాళేశ్వరం: మహదేవపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మహదేవపూర్, మహాముత్తారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషణ పడాయి ముగింపులో భాగంగా పోషనమాసం కార్యక్రమం గురువారం సీడీపీఓ రాధిక ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

రేగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ మడిపల్లి శ్యాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సన్నాహక సభకు మందకృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆరు మండలాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



బహుమతులు అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సాధన పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు గురువారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోత్ స్వరూపలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నాడని అన్నారు. చిత్ర లేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, విశ్వనాథ్, ఇమ్మడి రాకేశ్‌యాదవ్, రాయంచు నాగరాజు, లక్ష్మి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకుంటపల్లిలో నిర్వహించిన లంబాడీల తీజ్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం డీజే పాటలకు యువతులతో కలిసి ఎమ్మెల్యే స్టెప్పులేసి సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లంబాడీ కులస్తుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. తీజ్ వంటి పండుగలు సామాజిక ఐక్యతకు, సాంస్కృతిక పరిరక్షణకు దోహదం చేస్తాయన్నారు. మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, కురిమిల్ల రజితశ్రీనివాస్, నాయకులు ఆకుల మహేందర్, క్యాతరాజు సాంబమూర్తి, గురిజాల రవి, యువతీ, యువకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్న నాయకులు

కాటారం: ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పలువురు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా సేవా పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేసిన వారికి రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పీహెచ్‌సీలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సునీత

మంగపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి స్వప్నిత ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్(ఎస్‌ఎన్‌ఎస్‌పీఏ)కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 సంవత్సరాల లోపు 280 మంది పిల్లలకు ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అఖిల, తరుణ్, మనోజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వైద్య శిబిరాలు

వెంకటాపురం(కె): మండలంలో ఈ నెల 19 నుంచి 26 వరకు స్వస్థనారి స్వశక్తి పరివార్ కార్యాక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎదిర వైద్యాధికారి కోరం క్రాంతికుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 19న పిల్లాల వైద్య నిపుణులు, 22న ఛాతి వైద్యనిపుణులు, 23 స్త్రీ వైద్య నిపుణులు, 26న దంత వైద్య నిపుణులతో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయిలో..

ఎస్‌ఎస్‌తాడ్వాయి: స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడ్వాయి, కాటాపూర్, కొడిశాల గ్రామాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రణధీర్ బుధవారం తెలిపారు. తాడ్వాయి పీహెచ్‌సీలో నేడు(శుక్రవారం) పిల్లల వైద్య నిపుణులు, ఈనెల 22న స్త్రీ వైద్య నిపుణులు మహిళలకు సంబంధించిన వైద్య పరీక్షలు, ఈనెల 25న జనర్ మెడిసిన్ నిపుణులు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాటాపూర్ పీహెచ్‌సీలో ఈనెల 20, 23, 29న, కొడిశాల పీహెచ్‌సీలో ఈనెల 20, 24, 27న వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య సేవలకు వచ్చే మహిళలకు, పురుషులు, పిల్లలకు సంబంధించిన ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. మూడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోని ప్రజలు ఈవైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా కొత్తల పండుగ

వాజేడు: మండల వ్యాప్తంగా కొత్తల పండుగను గిరిజనులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతీ సంవత్సరం కొత్తల పండుగ (పెద్దల పండుగ)ను గిరిజన సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకుంటారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబంలోని చనిపోయిన వారికి నైవేద్యం సమర్పించారు.

కిసాన్ మాన్‌ధన్ యోజనతో ధీమా

- 18 నుంచి 40 ఏళ్ల లోపు రైతులకు అవకాశం
- 60 ఏళ్లు నిండిన తర్వాత ప్రతీ నెలా రూ.3 వేల చెల్లింపు



రేగొండ: చిన్న, సన్నకారు రైతులకు వృద్ధాప్యంలో ధీమాను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని 2019 నుంచి అమలు చేస్తోంది. దీని ద్వారా 60 ఏళ్లు నిండిన రైతులకు ప్రతీ నెలా రూ.3 వేల చొప్పున జీవిత కాలం పింఛన్ అందుతుంది. వృద్ధాప్యంలో రైతులకు ఆసరా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకానికి 18 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులు. ఆదాయ పన్ను, ఆర్థిక స్థితి, సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్న వారికి వర్తించదు. ఈ పథకంలో రైతులు వాటాధనాన్ని చెల్లించేందుకు వయసును బట్టి కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. వాటాదారుడు చెల్లించే అంతే మొత్తాన్ని ప్రభుత్వం వాటాధనంగా చెల్లిస్తోంది.

ముందుకు రాని రైతులు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంపై ఆశించిన స్థాయిలో ప్రచారం లేక రైతులు ముందుకు రావడం లేదని పలువురు వాపోతున్నారు. ఆరేళ్ల కాలంగా ఈ పథకం అమలులో ఉంది. 60 ఏళ్లు నిండిన లబ్ధిదారుడు మృతిచెందితే జీవిత భాగస్వామికి ప్రతి నెలా రూ.1,500 చెల్లిస్తారు.

నమోదు చేసుకోవడమిలా..

ఈ పథకంలో చేరడానికి అర్హత కలిగిన రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నోడల్ అధికారులను సంప్రదించాలి. లేకుంటే అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు. నమోదు సమయంలో భాగస్వామి పేరు, పుట్టిన తేదీ, బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, సెల్ నంబర్, ఆధార్ కార్డు అప్‌లోడ్ చేయాలి.

అవగాహన లేదు



కేంద్ర ప్రభుత్వం పేద రైతుల కోసం అమలు చేస్తున్న ఈ పథకంపై పూర్తి స్థాయి అవగాహన లేదు. చాలా మంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన లేక సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రతీ పథకాన్ని గ్రామపంచాయతీ, రైతువేదికల వద్ద నోటీసు బోర్డులపై అంటించి ప్రచారం చేపట్టాలి.

– మానురి అశోక్, రైతు, కొత్తపల్లిగోరి

ప్రచారం చేయాలి



కేంద్ర ప్రభుత్వం చేపట్టే పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రచారం చేపట్టడం అధికార యంత్రాంగం విఫలమవుతోంది. రైతుల ప్రయోజనాల కోసం చేపట్టే ప్రతీ పథకం పేద, చిన్న, సన్నకారు రైతులకు చేరేలా వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించాలి. పంటల నమోదు సమయంలోనైనా రైతు ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పథకాలపై వివరించాలి.

– పెండల రాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

'విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం'



మాట్లాడుతున్న సురేశ్

చిట్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యా వ్యవస్థను, విద్యార్థులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ సర్కార్‌లో ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమైందని ఆరోపించారు. జిల్లాలో స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్ సొంత భవనాలను నిర్మించాలని అన్నారు. జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంశీ, సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని రాస్తారోకో..



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కంకల వాగు సమీపంలో ఇసుక లారీలకు ఇసుక రీచ్‌ల వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ.. ఇసుక లారీకు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయటం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్ సంఘటన ప్రాంతానికి చేరుకోని ఆందోళనకారుతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహాచారి, మాణిక్యం సమ్మయ్య తదితరులు ఉన్నారు.

డైలీవేజ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్



నిరసన తెలుపుతున్న డైలీవేజ్‌వర్కర్లు

ఏటూరునాగారం: గిరిజన ఆశ్రమ పాఠశాలో డైలీవేజ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ అన్నారు. గురువారం ఏడో రోజు కళ్లకు గంతలు కట్టుకొని డైలీవేజ్ వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డైలీవేజ్ వర్కర్ల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని అన్నారు. జీఓ నంబర్ 64ను ఎత్తి వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగలక్ష్మి, విజయలక్ష్మి, కమల, జయలక్ష్మి, నాగమణి, సరోజిని తదితరులు ఉన్నారు.

రమేష్ కుటుంబానికి అండగా ఉంటాం..

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



అంతిమ యయాత్రలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు పోరిక రమేశ్ కుటుంబానికి అండగా ఉంటామని ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ములుగు మండలంలోని అన్నంపల్లిలో రమేశ్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. రమేశ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రమేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని అన్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రమేశ్ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయులు యాకూబ్‌రెడ్డి, శ్రీరంగం, మహేందర్‌రెడ్డి, శ్రీహరి, ముకుందరెడ్డి, శివప్రసాద్, రాజయ్య, స్వరూప్‌సింగ్, మోహన్‌లాల్, నర్సింహచారి, దేవకి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ములుగు రూరల్: పరామర్శిస్తున్న రవిచందర్



మంగపేట: పరామర్శిస్తున్న నాగజ్యోతి

ములుగు రూరల్: మండలంలోని ప్రేమ్‌నగర్ గ్రామానికి చెందిన గుగులోత్ శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని, అన్నంపల్లి గ్రామానికి చెందిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు పోరిక రమేష్ హనుమకొండలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల రేవంత్ యాదవ్, గండ్రత్ జయాకర్, అభినయ్‌చారి, తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని కమలాపురానికి చెందిన శ్రీమన్నారాయణ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి ఆ పార్టీ నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. అలాగే ఇటీవల బీఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు రాజేష్ భర్య మృతి చెందగా పరామర్శించి ఓదార్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి రాజు యాదవ్, మాజీ జడ్పీటీసీ తుమ్మల హరిబాబుతోపాటు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



వెంకటాపురం(కె): రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

వెంకటాపురం(కె): కలెక్టర్‌పై బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహామూర్తి అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి అన్నారు. కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. కొమురం భీం విగ్రహం వద్ద నుంచి ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు, కార్యకర్తలు, రైతులు మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ.. నకిలీ విత్తనాతో ఆదివాసీ రైతులను మొక్కజొన్న డీలర్లు మోసం చేశారని అన్నారు. రైతుల పక్షాన నిలబడి వారికి నష్ట పరిహారం ఇప్పించిన కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. అనంతరం కలెక్టర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవ నిర్మాణ సేన కాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలి

కలెక్టర్ దివాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని వెంకటాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బాలసాని వేణు, మన్నెం సునీల్, జల్లిగంపల కళధర్, కొండపర్తి సీతదేవి, చిట్టెం సాయి, మురళి, విక్రాంత్, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

మంగపేట/వాజేడు: నకిలీ మొక్కజొన్న విత్తనాలతో మోసపోయిన బాధిత రైతులకు న్యాయం చేసిన జిల్లా కలెక్టర్‌ను అంతు చూడాలని మాట్లాడిన బీఆర్ఎస్ నాయకుడు గూడవర్తి నర్సింహారావు బేషరతుగా ప్రజా క్షేత్రంలో బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా నాయకులు కాకర్ల పూడి విక్రాంత్, దంతులూరి విశ్వనాథ వర ప్రసాద్ అన్నారు. మంగపేట, వాజేడు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో వారు మాట్లాడారు. మొక్కజొన్న విత్తనాల ఏజెంట్ గుడవర్తి నర్సింహమూర్తి కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరైన పద్ధతి కాదని అన్నారు. మంగపేట మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సురేష్, హుస్సేన్ వాసు, వత్సవాయి జగన్నాథ రాజు, తల్లండి ఆదినారాయణ, సంజీవ, ఎల్లయ్య, రామ్మూర్తితో పాటు తదితరులు ఉన్నారు.